


# జాతక చక్రాలు

"శారిక"

"ఓబిటానీలు! కాలక్షేపం బటానీలు! రైలు దిగేదాకా టైంపాస్ బటానీలు!"

"ఏంరా! నూరిగా డెక్కండంట్రా? ఒరే! నూరిగా! ఎక్కరా యెదవా! బండి కదలి పోతంది!"

"ఏమిటయ్యా! కళ్ళు కనబడటంలా! కాళ్ళమీద పెడుతున్నావ్!"

"ఇక్కడ మా వాడున్నాడండి. కిందికి దిగేడు మళ్ళీ వస్తాడు."

"సంచీ ఆ పెట్టెమీద పెట్టూ! ఎంత సేపట్లా పట్టుకుంటావ్!"

"కొంచెం లోపల కుండండి దొరగోరు!"... కేర్‌మని చంటిపిల్లాడి ఏడుపు. 'ఉష్'మని ఓదార్పు. చెవులు చిల్లులు పడేటట్లు రాక్షసి కూత! ఝుప్! ఝుప్!... ఝుప్! ఝుప్!

ఈ శబ్దాలాన్నీ చెవుల్లో దూరినా రావుగారి మెదడు చేరలేదు. రైలు బండి చక్రాలు గోదావరి స్టేషను వదలి గోదావరి బ్రిడ్జిమీదకు దొర్లి పోయాయ్.

సమాంతరమైన ఎలక్ట్రిక్ తీగల మధ్యనుంచి పోలికలు లేని వికృతమైన కదలికలతో విజృంభించిన ప్రకృతి శక్తిలా పరవళ్ళు తొక్కుతూ పరిగెడుతూంది గోదావరి. ప్రళయ సంగీతంలా ఘోషిస్తుంది గోదావరి బ్రిడ్జి అడ్డు వచ్చిందనే కోపావేశంలో. సుళ్ళు తిరుగుతూన్న కెరటాల మధ్య గిరగిరా తిరుగుతున్నాయి నురుగులు. ఆశలకూ అనుభవాలకూ మధ్య తిరుగుతున్న దైవోపహతుడి జీవిత గమనంలా నడువలేక నడువలేక నడుస్తూన్న నిండు బాలింతలా వరిగెడుతూంది బ్రిడ్జిమీద రైలు బండి. నాకేం లెక్కలేదన్నట్లు. ఒక తీగె మీద నుంచి మరో దానిమీది కెగిరి క్షణకాలంలో నలుసులా దూరమైంది చిన్న పిచ్చుక.

తదేకంగా అలే చూస్తూంటే కళ్ళు తిరుగుతూన్నట్లనిపించి తలెత్తి కళ్ళజోడు తీసి ప్రక్కకు చూసేరు రావుగారు. కంట్లో బొగ్గునలుసు పడింది. ఖంగారులో చేతిలో కళ్ళజోడు గోదావరిలో పడినంత పని

అయింది. తల లోపలకు తీసుకున్నారు రావుగారు.

కాలి చీలమండకు గుచ్చుకున్న కావడిబద్ద ఈ ప్రపంచంలోకి తీసుకు వచ్చింది రావుగారిని. సీటు క్రింద కావడిబద్ద తోస్తున్నతను అది గుర్తించినట్లు లేదు. కాలు ప్రక్కకి తీసుకొని తిరిగి తల బయటకు తిప్పేరు రావుగారు.

దూరపు కొండలు నీలిమబ్బుల్లా ఉన్నాయి. రైలు వెనక్కాలే రావడానికన్నట్లు అవి రెండవ వైపుకు తిరుగుతున్నాయి.

'ఏ ఊరమ్మా మీది?' ఒక ముసలి కంఠం.

'కోటిపల్లండి!' ఒక స్త్రీ కంఠం

'ఆఁ! ఎక్కడో చూసినట్లుంటేను!'

'అమలాపురంలో చూసి ఉంటారు.'

'అయితే నువ్వు...'

'వెంకట్రామశాస్త్రి గారమ్మాయినండి.'

'అదీ! అలా చెప్పు! బాగున్నావా? మీ నాన్నగారు కులాసాయేనా?'

'ఆఁ! బాగానే ఉన్నారండి! ప్రకాశం! దా! నావళ్ళో కూర్చో! తాతగారక్కడ కూర్చుంటారు!'


'అక్కర్లేదమ్మా! ఇలా నుంచుంటాన్లే!'

'ఫరవాలేదు! కూర్చోండి!'

ప్రక్క కిటికీలోంచి సంభాషణ విన్న మరో నిముషం దాకా రావుగారి మెదడులోకి పోలేదా మాటలు. ఉన్నట్టుండి ఏదో మెరుపులా మెరసింది ఆయన మెదడులో. మనసంతా ఆశ్చర్యంతో నిండిపోయింది. 'ఆమేనా! అమలాపురం... వెంకట్రామశాస్త్రిగారి అమ్మాయి... ఆమేనా! సీతా మహాలక్ష్మేనా!' తల ప్రక్కకు తిప్పి ప్రక్క కిటికీవైపు చూసేరు రావుగారు. గోరింటాకు పెట్టుకున్న చేయి కిటికీలోంచి కనబడుతూంది. గులాబీ రంగుతో మెరుస్తూన్న ఆ వేళ్ళలోనే ఎంతో అందం కనబడింది రావుగారికి. ప్రక్కకు తిరిగిన ఆ చేతి ఉంగరంలో నీలిరాయి కాంతివంతంగా మెరుస్తూంది. ఆమె ఇప్పుడెలా ఉందోనని ఆపుకోలేని ఆతృత చుట్టుముట్టింది రావుగారిని. ఒకసారి వెళ్ళి చూద్దామా అనే ఆలోచనతో వెనక్కు తిరిగేరు. పెట్టె జనంతో నిండిపోయి కదలడానికి వీల్లేకుండా ఉంది. చేసేది లేక తిరిగి ఆ చేతివైపు చూస్తూ అలాగే కూర్చుండి పోయారు.

'ఎందాకా ప్రయాణం!'

'హైదరాబాదండి!' మళ్ళీ అదే కంఠం.



'హైదరాబాదా? అక్కడెవరున్నారు?'

'మా పెద్దబ్బాయి అక్కడ ఇంజనీరుగా పని చేస్తున్నాడు! మా వారు కూడా అక్కడే ఉన్నారు! ఒకసారి రమ్మని ఉత్తరం వ్రాస్తే చూసొద్దామని వెడుతున్నాను.'

'మీ ఆయన కాకినాడలో ఏదో కంపెనీలో పని చేస్తున్నాడని విన్నాను. ఇప్పుడు...'

'అక్కడే పని చేస్తున్నారండి. ఏదో పనుంటే వారం రోజులక్రితం శలవుపెట్టి హైదరాబాదు వెళ్లారు.'

పిల్లలెందరు? వీడు మీవాడేనా!'

'వీడు మా రెండోవాడు. వీళ్ళిద్దరికీ మధ్య ఓ అమ్మాయి ఉంది. అమలాపురంలోనే ఉంది. చదువు చెడుతుందని దాన్ని ఉంచేసేను.'

'చదువుతూందా? ఏం చదువుతూంది?...'

'స్కూలు ఫైనలు!'

మా పెద్దమ్మాయి ఏలూరు లో ఉంది. పది రోజుల్నుంచి ఒకటే జ్వరముట. ఓసారి చూసొద్దామని వెడుతున్నాను."

తరువాత రావుగారికేమీ విన బడలేదు. ఆమెను చూడాల నే ఆత్రుతతో ఆయన కూర్చోలేక పోతున్నారు. ఆ అందమైన చెయి ఆమెదేనా! ఆమె సీతామహ లక్ష్మేనా! పాతికేళ్ళ తరువాత ఇప్పుడెలా ఉంది? ఎలా ఉంది?...

● ● ●

నీలిరంగు పరికిణీ, నీలిరంగు వోణీలో గులాబి రంగు జాకెట్టు తొడుక్కొని, తల్లి పొదివిపట్టి తీసు కొని వస్తూంటె సిగ్గుతో గోముగా నడుస్తూ వచ్చి నేలచూపులు చూస్తూ కూర్చుంది సీతామహలక్ష్మి. తాటాకు చాప గోరింటాకు వేళ్ళతో సన్నగా చీరుతోంటే "నీ పేరేమి టమ్మా!" అన్నారు రాఘవయ్య గారు. "సీతామహాలక్ష్మి! అని ఓర కంటితో ఒకసారి అయన్ను చూసి తలదించేసింది.

అందరూ అందంగా ఉంటుందని చెప్పినా అంత అందంగా ఉంటుం దని ఊహించలేనందుకు మనసుచిన్న బోతూంటే కంగ్రాచ్యులేట్ చేశాడు రామమోహనరావు తన మనస్సును. వికసిస్తూన్న గులాబి మొగ్గలా ఉన్న సీతామహాలక్ష్మి ఆ తాటాకు చాపలో కూర్చుం టూనే అతని హృదయ పీఠాన్నా క్రమించింది. ఆమె ముఖంలో సిగ్గు దొంతరలు దొర్లిపోతూంటే, సన్నగా కాటుక దిద్దిన కనురెప్పలు మిలమిల లాడుతూంటే. నలుగురూ విసిరే మాటలకు చిరునవ్వుతో సాగిపోతూన్న ఎర్రని పెదవులను మునిపండ్లతో నొక్కి పడుతూంటే, రామమోహనరావు మనస్సు ఆనం దంతో మైమరచి పోయింది. పెద్దల పరీక్షలైన తరువాత ఆమె తిరిగి లేచి వెడుతూంటే, మెరవు తీగెలా కదులుతూన్న ఆమె సన్నని నడుము, పొడవైన జడగంటలు నాట్యం చేస్తూన్న పిరుదులు, మీ అయన్ను చూసేవా అని ఎవరో అంటే సిగ్గుతో కూడినకోపంతో పెట్టినబుంగ మూతి ... ఆమె మచ్చలేని ఒక సౌందర్య రాసిలా, పసిడి బొమ్మలా కన్పించింది రామ మోహనరావు కళ్ళకు. తండ్రి భుజంమీద చేయివేసే వరకూ రామ మోహనరావు ఈ లోకంలోకి రాలేదు,

ఎంతో బలవంతంమీద పెళ్ళి చూపులకు వెళ్ళేడు రామమోహన రావు. ఒకవేళ తాను మొండిగా 'నేను రానవేస్తే!' ఏమై పోయేది.

అమ్మో! సీతామహాలక్ష్మి తనకు కాకుండా పోయేదా! ఆ ఆలోచనే భరించ రానిదిగా అనిపించిం దతనికి.

రాత్రి తొందరగా భోజనంచేసి మడతమంచం వీధిలో వేసి పడు కున్నాడు రామమోహనరావు.

త్రయోదశి చంద్రుడు డు చెట్ల మీదుగా పైకి లేచేడు. మేలి మునుగుల్లా తెల్ల మబ్బులు చంద్రుడి మీదుగా పోతున్నాయి, గోదావరి మీదనుంచి వస్తున్న చల్లని గాలి వంటికి గంధం పూస్తున్నట్లుగా ఉంది. నిశ్శబ్దమైన రాత్రి ప్రకృతి కన్య ప్రశాంతమైన సుషుప్తిలా ఉంది.

రామమోహనరావు సీతతో తన భావి జీవితాన్ని ఊహించుకో సాగేడు. ఉదయం నుంచి సాయంత్రం దాకా తాను చేసే అన్ని నిత్యకృత్యాల్లోనూ ఆమె నూహించుకున్నాడు. సీత తనకు ఎన్నాళ్ళనుంచో తెలుసునేమోనని పించింది. 'ఆమె తోడు లేకుండగా ఇన్నాళ్ళు తన జీవితం ఎలా నడి చింది! ఇకపైన తన చిత్రకళకు ఆమె రూపం, ఆమె భంగిమలు అసాధారణ సుందర చిత్రాలు. ఆమె జీవిత కాలం తన సొత్తు. ఆమె చిరునవ్వులు, బెదురుచూపులు తన ఆరాధ్య దైవాలు. ఇన్నెందుకు? ఆమె భార్య. తను భర్త. వెన్నెల రాత్రులు. ఏకమయ్యే మనసులు. వెచ్చని కౌగిలులు. పేనుకునే మమ తలు. విసలేని కలయికలు. ఎంత హాయి! ఎంత మధురం! దేవుడా నేనెంత అదృష్టవంతుణ్ణి!' తీయని ఆలోచనలతో ఇటూ అటూ దొర్లు తూంటేనే అతనికి తెలియకుండానే కను రెప్పలు మూనుకొన్నాయి.

రామమోహనరావు కళ్ళు విప్పి చూసేడు. కటికచీకటిలా కనబడింది. చంద్రుణ్ణి నల్ల మబ్బులు కప్పి వేశాయి.

● ● ●

దాని తరువాత రావుగారికి ఆలోచించుకోడానికి కూడా భయ మనిపించింది. ఆ రోజు తాను అర్థ రాత్రి కండ్లుతెరవకపోతే! తెరవక పోతే ఏమిటి? తెరిచేడు జరగా ల్సిందేదో జరిగిపోయింది. తన అను భవాలు కాలగమనంలో శిలాక్ష రాలుగా చెక్కబడి పోయాయి, భూతకాలంలోకి చొచ్చుకొని పోయే శక్తి మానవుడికి లేదు. భవి ష్యత్తును ఒక్కక్షణం కూడా ఆపగల శక్తి కూడా లేదు. కాల చక్రాన్ని నిలపగల వాడెవ్వడు? అయినా తనభవిష్యత్తు ఎలాగడిస్తేమాత్రమేం! ఎలా గడిచినా ఫరవాలేదు

ఏదో స్టేషను వచ్చింది. బండి ఆగింది. కొంతమంది జనం దిగేరు. రావుగారు వెంటనే లేచి వచ్చి ప్రక్క వరుసలో ఉన్న ఆమెను

చూసేరు. ఆ చేయి ఆమెదే! ఎంత మార్పు! ఆమె సీతా మహలక్ష్మి! సందేహంలేదు! సందేహంలేదు!... ఆమె ఎదురు సీటులో కూర్చున్నాయన పై నించి సామానులు దింపుకుంటున్నాడు. మళ్ళీ ఎవరైనా కూర్చుంటారేమో! రావుగారు మరుక్షణంలో తన సీటు దగ్గరకు వెళ్ళి సంచి తీసుకొని వెళ్ళి ఆమెకు ఎదురుగా ఉన్న సీటులో కూర్చున్నారు.




బండి కదిలింది. రావుగారు రెప్ప వాల్చకుండా ఆమెవైపే చూస్తున్నారు.

ఆమె కిటికీకి మోచేయి ఆన్చుకొని దూరంగా బయటకు చూస్తూంది. నీడలు దాటినప్పుడు ఆమె ముఖంమీద పడుతూన్న ఎర్రని నీరెండలు ఆమె బుగ్గలపై వింత రంగులు సృష్టిస్తున్నాయి. వయసు మీరినదైనా ఆమె ముఖంలో అంత వయసు కనబడటం లేదు. ఏదో లావణ్యం కొట్టవచ్చినట్లు కనబడుతూంది. ఏదో గుర్తుకు వచ్చిందేమో ఒక్కసారి ఆమె పెదవులపై చిన్న చిరునవ్వు వెలిగింది. సూర్యుడి పసిడి కిరణాలకు రెపరెప లాడుతూన్న కాటుక కళ్ళు నీటి అలల తాకిడికి పులకరిస్తూన్న విడుస్తూన్న నల్ల కలువల్లా ఉన్నాయి. గుండ్రంగా తీర్చిదిద్దిన ఆమె నుదుటి కుంకుమపై వినురు గాలికి చిరు వెండ్రుకలు నాట్యం చేస్తున్నాయి.

అప్రయత్నంగా రావుగారి దృష్టి క్రిందికి పోయింది. ఉన్నతమైన ఆమె హృదయానికి బిగువుగా చుట్టుకున్న ఆకుపచ్చ చీరె జరీ అంచు లోంచి మాంగల్యం తొంగి చూస్తూంది—'పెద్ద మనిషీ! తల పక్కకు తిప్పవోయ్!' అంటూన్నట్లుగా.

'అతడెంత అదృష్ట వంతుడు ?' అనుకున్నారు రావుగారు ఆమె భర్త ఉనికి మనసులో మెదిలి.

'అమ్మా! నేలచూడవే ఎంత తొందరగా కదిలిపోతూందో!' అన్నాడు ఆమె ఒడిలోనుంచి నిల్చొని పిల్లవాడు క్రింది నేలను చూస్తూ.

'అలా చూడకు! కళ్ళు తిరుగుతాయి' అని ఆమె అతన్ని ఒడిలో కూర్చోపెట్టుకొంది.

ప్రతిమ కదిలింది. మాటాడింది. అందులో సౌందర్య తరంగాలు దొర్లిపోయాయి. రావుగారు తదేక దృష్టితో తన వైపు చూస్తూన్నట్లు గమనించి ఆమె పూర్తిగా పైటకప్పుకొని కొడుకు తల నిమురసాగింది. ఆమె పైట సర్దుకోవడం చూసి రావుగారు తడబడి సంచిలోంచి పేపరు తీసి పేపరులో తల దూర్చేరు. మరో నిముషానికిగాని ఆయన గమనించలేదు తన చేతిలో పేపరు తలక్రిందులుగా ఉన్నట్లు. ఎవరైనా చూస్తున్నారేమోనని ఇటూ అటు చూసి పేపరు సరిగా తిప్పుకున్నారు రావుగారు.

ఇంత సౌందర్యరాసి తనకెందుకు దూరమయింది. ఎంత వద్దనుకున్నా ఆ గుర్తు తెచ్చుకోవద్దనుకున్న రాత్రి ... ఆ కారుమబ్బులు కమ్మిన రాత్రి... తన జీవితాన్నే పూర్తిగా చీకటిలో పూడ్చివేసిన రాత్రి ... కళ్ళముందు నిలుస్తూంది.

• • •

కటిక చీకటి. గోదావరిమీద నుంచి చల్లగా ఈదురుగాలి వీస్తూంది దూరంగా గోదావరిలో పడవవాళ్ళ కేకలు వినబడుతున్నాయి. పీటిగట్టుమీద లాంతరు స్తంభంలో దీపం గిలగిల లాడుతూంది. అలాగే రోడ్డుమీద నీడలు కూడా మిలమిలా కొట్టుకుంటున్నాయి

ఉన్నట్లుండి లాంతరు స్తంభం క్రిందికి, ఒక నల్లటి ఆకారం వచ్చి క్షణకాలం ఉండి మాయమైంది. రామమోహనరావు కళ్లు నులుపుకు చూసేడు. ఆ ఆకారం తిరిగి కనబడలేదు. కలా! భ్రమా! అక్కడి నాపరాతి మెట్లమీదకు ఎవరో వచ్చి దిగి ఉంటారు. ఎవరై యుంటారు? ఎందుకు? ఎందుకో అతని మనసులో ఏదో కుతూహలం తలెత్తింది.

వెంటనే లేచి పది అడుగుల్లో లాంతరు స్తంభం చేరుకున్నాడు. నిజమే! కలా కాదు. భ్రమా కాదు. ఎవరో మెట్లమీదనుంచి క్రిందికి దిగుతున్నారు. ఎందుకు ఇంత అర్ధరాత్రివేళ? ఎవరు?

# పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ, విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా తెలపరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందిన రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరంలేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా "ఎడిటర్," జ్యోతి, సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2".

8. రూ. 50 లు ప్రథమ బహుమతి, రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

ఆత్మహత్యకు కాదుగదా ? అతని గుండె ఝల్లుమంది. అతను కూడా త్వరత్వరగా మెట్లు దిగేడు. అతనింకా పదిమెట్లు పైనుండగానే ఆ ఆకారం అఖరి మెట్టుమీద నిలచింది.

'ఆగు !' ఒక్క కేకపెట్టి అతను గబగబా మెట్లు దిగిపోయాడు.

అనుకోని శబ్దం వినడం మూలాన్నేమో ఆ ఆకారం క్షణకాలం నిలిచిపోయింది. వెన్వెంటనే గోదావరిలోకి దూకబోయింది. రామమోహనరావు బలంగా చెయ్యి పట్టుకున్నాడు. టపటపా గాజులు పగిలేయి. ఆ యువతి గింజుకో సాగింది. అతను ఆమెను బలవంతంగా రెండుమెట్లు పైకి తీసుకొని వచ్చేడు. చీకట్లో ఆమె ముఖం స్పష్టంగా కనబడటంలేదు. ఆమె భోరుమంది.

'నన్ను వదలండి ! నేను బ్రతకలేను ! నన్ను చచ్చిపోనీయ్యండి. మీకు పుణ్యం ఉంటుంది !' ఆమె ఆర్తనాదం అతని హృదయాన్ని కలచి వేసింది. ఏదో పరిచితమైన కంఠంలా ఉంది.

'వదలను ! మీరు పైకి రండి ! మీతో మాట్లాడాలి !' అన్నాడతను.

ఆమె విపరీతంగా విలపించ సాగింది.

'చూడండి! ఎవరైనా వింటే ఇంకా అభాసవుతుంది. పైకి రండి. నేను చేతనైన సాయం చేస్తాను.' పైకి తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నిస్తూ అన్నా డతను.

'నా కెవ్వరూ ఏమీ చెయ్యలేరు' ఎగుపుల మధ్య నిస్పృహగా వచ్చేయి ఆమె నోట్లోంచి మాటలు.

పై మెట్లదాకా వచ్చి అక్కడ కూలబడి పోయిందామె. అతనామె ముఖానికి అడ్డుగా పెట్టుకుంటూన్న గుడ్డను ప్రక్కకు తీశాడు.

'అనసూయా! నువ్వా! ఏమి టిది?' నివ్వెరపోయే డతను. ఆమె కన్నీరు ఏకధారగా కారుతూంది. రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. ఆమె నోదార్చడం అతని సాధ్యం కాలేదు.

ఎన్ని విధాలుగా అడిగినా అత డామె ఆత్మహత్యా ప్రయత్నాని కారణం తెలుసుకోలేక పోయాడు. చివరకు అతడే సాహసించి ప్రశ్నించగా అవునన్నట్లుగా తలూపింది. దానికి కారణమైన వ్యక్తి పేరు వినగానే అతని కేదో ఆశాకిరణం పొడసూపింది. 'మధుసూదనం నాకు తెలుసననూయా! ఈ విషయం అతనికి తెలిసి ఉండదు. నేను రేపు పోయి అతనితో మాట్లాడుతాను. మీ పెళ్ళికి అతను ఒప్పుకుంటాడనే నమ్మకం నాకుంది. ఈ భారం నా మీద వదిలెయ్ అనసూయా! మళ్ళీ నువ్వీ ప్రయత్నం చెయ్యకు.'

ఆ క్షణంలో అత డామెకు అందరికంటే అప్తుడుగా కనబడ్డాడు. అవధులు దాటిన కృతజ్ఞతతో ఆమె అతని పాదాలు తాకింది.

మధుసూదనం రామమోహనరావు క్లాసుమేటు రాజమండ్రిలో బి. ఏ. చదివేటప్పుడు. రామమోహనరావు మద్రాసులో తరువాత రెండేళ్ళు చదివి ఎం. ఏ చేశాడుఅప్పటికిమధుసూదనంకూడా అనసూయా వాళ్ళింట్లో అద్దెకు వుండి, బి. ఏ. కంపార్టుమెంటల్‌గా కంప్లీట్ చేశాడు.

మర్నాడు ఉదయం రామమోహనరావు మధుసూదనం వాళ్ళ ఊరికి వెళ్ళాడు. అనసూయ గర్భవతి అయిందన్న వార్త వినగానే భయపడి మార్గమేమిటన్నీ అడుగుతా డన్న ధైర్యం చెప్పి ఈ పెళ్ళి తప్పక జరగేలా చేయాలనీ అనుకున్నాడు రామమోహనరావు.

కాని మధుసూదనం అలా మాట్లాడుతాడని ఊహించ లేదు. ఎంతో ఉన్నత భావాలు ప్రదర్శించిన మధు ఈ రెండేడ్లలో అలా మారుతాడని అతడు ఊహించలేక పోయాడు. అతడసలు తాను చేసిన తప్పే ఒప్పుకోలేదు. కనీసం అతని మాటలన్నీ వినగలిగేడు. కాని 'ఆమె


విషయంలో నీ కింత ఆసక్తి ఏమిటి? ఆమె గర్భవతి అయితే నీ కీ ఆందోళన ఎందుకు? ఆమెకు నువ్వేమవుతావు? ఆమెకూ నీకూ సంబంధం ఏమిటి? దీనికి కారణం నువ్వే కావచ్చు! నీవు చేసిన నేరాన్ని, నా ఖర్మకాలి వాళ్ళయింట్లో రూమ్ తీసుకున్నాను కదా అని నా మీద అంటకట్టడానికి ప్రయత్నిస్తున్నావు!' అని మధు తననే అంటూంటే సహించలేక పోయాడు. మధుసూదనం అంతనీచుడని ఊహించలేక పోయేడు. అతని నోటిని అతనే నిగ్రహించుకోలేకపోయేడు. అతనేమన్నాడో అతనికే తెలీలేదు. ఫలితంగా రామమోహనరావు చెంప ఛెళ్ళుమంది. అతని కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

'నువ్వు చేసిన తప్పు దిద్దుకోవడంలో సాయం చేద్దామని ప్రయత్నించేను మధూ! నేను నిన్ను తిరిగి కొట్టలేకపోవచ్చు! కాని నీ పాపం నీకు చెంపదెబ్బకొడుతుంది మధూ! అనసూయ రాల్చిన ప్రతి కన్నీటి బొట్టూ నీజీవితంలో రక్తపుచుక్కల్ని పిండుతుంది. నీ చెంపదెబ్బకిదే నా సవాలు.' మధు ముఖం చూడకుండానే గిరుక్కున వెనక్కు తిరిగేడు రామమోహనరావు.

తీరిపోతుం దనుకున్న సమస్య వేయి పడగలతో ఎదురుగా నిల్చుంది. ఇప్పుడు దేనికి జీవించను? అని అనసూయ అడిగితే ఏమని జవాబు చెప్పాలి. అతని కేమీ పరిష్కారం తోచలేదు. బస్సు క్షణ క్షణానికి అతని శరీరాన్ని అనసూయకు దగ్గరగా చేరుస్తూంది. ఉన్నట్లుండి అతని మనస్సులో ఒక్క ఆలోచన మెదలింది.

'తనే అనసూయను పెళ్లాడితే!' అతని గుండె కలుక్కుమంది.

'మరి సీతామహాలక్ష్మి? తన కలలన్నీ ఏమి కావాలి? అసంభవం. తన జీవిత సౌఖ్యాన్ని ఒక అమాయకురాలి పొరబాటుకు బలిచెయ్యలేడు. ఆమె కాటుక కళ్ళలోని సౌందర్యాన్ని చూడకుండా నడకలోనే నాట్యం చేసే ఆమె సన్నని నడుమును కౌగలించుకోకుండా... ఆమెలేక తను లేడు. ఆమెలేని తన భవిష్యత్తును ఊహించుకోనేలేడు....' రామమోహనరావు మనస్సులో అంతర్యుద్ధం మొదలైంది. 'వేదికలెక్కి ఉపన్యాసాలివ్వడమే ఆదర్శమయితే అది అందరూ చేస్తారు. నీ కళ్ళముందు మధు కూడా గతంలో ఆదర్శ పాఠాలు వల్లించలేదూ! నీ పరోక్షంలో ఇప్పుడు వల్లించటం లేదూ! ఇంతెందుకు? రాత్రి ఆ దీనురాలి ముందు మవ్వన లేదూ మీ పెళ్ళి చేసే బాధ్యత నాదని? అదంతే! మధు ఆమెను



వంచించేవు. దాని ఫలితంగా ఆమె చావబోయింది. నీవు ఆమెలో చచ్చే శక్తిని చంపేసేవు. నువ్వా ఆమెను వంచించేవు! ఫలితంగా ఆమె భయపడి పారిపోబోయిన... ఆ నరకం ... ఈ పైన అనుభవించ వలసి రావచ్చు!...'

రామమోహనరావులో ఒక మారుమూల ఒక మంట లేచింది.

'నాకేమీ వద్దు! నేనే పాపం చేయలేదు. నాకే ఆదర్శం లేదు. నేనొక సామాన్య జీవిని. నా బ్రతుకు నన్ను బ్రతకనీ! ఇది నాకు చేతకాదు!'

'దిగండి సార్!' అని కండక్టరు గుర్తు చేస్తే ఖాళీ బస్సోసారి పరికించి చూసి బస్సు దిగేడు రామమోహన రావు.

అతని కోసమే గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తూన్న అనసూయ కళ్ళు, సిగ్గు అవమానం మరిచిపోయి ఆతృతతో వేయి ప్రశ్నలు వేశాయి. అతని ముఖమే ఆమెకు జవాబు చెప్పింది. నీరసంగా ఆమె తల ప్రక్కనున్న స్తంభానికి వాలింది ఒక్కసారి నిరాశతో, సిగ్గుతో అవమానంతో. దారం తెగిన పూసల్లా కన్నీటి బిందువులు చెక్కిళ్ళ మీదుగా జారిపోయాయి

రామమోహనరావు మానవ హృదయం పొంగిపోయింది. ఏదో పిచ్చి ఆవేశం అతనిలో పొర్లి వచ్చింది. అనసూయ శరీరం చితిలో కాలుతున్నట్లే కనిపించింది అతనికి.

'అనసూయా!' ఆమె తల తిప్పింది.

'నువ్వు భయపడకు అనసూయా! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. ఈ క్షణమె మా నాన్నగారితో చెప్పి వస్తాను.' అతను మెరుపులా వెళ్ళిపోయాడు. ఆమె చెవులు విన్న దానికి ఆమెకు చైతన్యం తప్పింది. అలాగే స్తంభం మొదట్లో కుప్పగా కూలబడి పోయింది.

'ఎందు కిష్టంలేదు నీకి పెళ్ళి ?' అర్థంకాక అడిగేరు రాఘవయ్య గారు

'నే నిదివరకే ఒక పొరపాటు చేశాను నాన్నగారూ! అది దిద్దుకోవడం నా ధర్మం. ఆమెను పెళ్ళి చేసుకొనే అర్హత నాకులేదు.' నిబ్బరంగా చెప్పేడు రామమోహనరావు.

'రామం!' గర్జించే రాయన.

'నే నింకో యువతికి మాటిచ్చేను నాన్నగారూ!... ...మాట కాదు నే చేసిన పొరపాటు దిద్దుకోలేనిదిగా మారింది. నే నామెను పెళ్ళి చేసుకోవాలి నాన్నగారూ!'

'రామం!' రాఘవయ్యగారి కేకతో ఇల్లంతా ప్రతిధ్వనించింది. జడ్జిగా రిటైరైన రాఘవయ్యగారికి కొడుకు నేరస్థుడుగా కనబడ్డాడు. శిక్ష తనే నిర్ణయించుకున్నాడు. దానిని కాదనడం ఆయన కసాధ్యం. తల్లి లేని లోటు లేకుండా పిల్లవాణ్ణి ఆదర్శ ప్రాయంగా పెంచేనని గర్వపడుతున్న ఆయన హృదయం పగిలిపోయింది. అప్పటి వరకూ అన్ని ఆశలకూ కేంద్రీకృత మయిన కొడుకుపై ఆయనకువిపరీతమైన జుగుప్స కలిగింది.

'ఈ మాట పెళ్ళిచూపులముందెందుకు చెప్పలేదూ ?' కటువుగా వచ్చింది ప్రశ్న.

'చెప్పలేకపోయాను.' 'ఈతుఫానుకు సిద్ధపడే ఉన్నాడు రామమోహనరావు.

'ఎవరా అమ్మాయి ?'

'ప్రకాశం మేస్టారి అనసూయ' భరించలేనట్లుగా రాఘవయ్యగారు తల అడ్డంగా తిప్పేరు.

'ఈవేళ మొదటి సారిగా జీవితంలో మోసపోయాను రామం' రాఘవయ్యగారు బయటకు వెళ్ళిపోయారు. ఆయన నోట్లోంచి చెదిరి వచ్చిన మాటలు అతని గుండెల్లో శూలాల్లా దిగేయి. రామమోహనరావు కళ్ళనిండా నీళ్ళు నిండిపోయాయి.

అనసూయ అతని జీవితంలోకి వచ్చేసింది. సీతామహలక్ష్మిలాంటి అపురూప సుందరికి ఇటువంటి నీచుడు తగడనిపింపించింది రాఘవయ్యగారి దృష్టిలో. తండ్రీ కొడుకుల మధ్య ఎన్నటికీ పూడని అగాధం ఏర్పడి పోయింది.

'మీ స్థితికి నేను తగిన దాన్ని కాను. కాని దేవుడిలాంటి మీ గొప్ప ఉదారబుద్ధి వలన మీవంచకు రాగలిగేను. సిగ్గుమాలిన పని చేసి నలుగురి మధ్య తలెత్తుకు బ్రతక లేక, దిక్కుమాలిన చావు చచ్చే నాకు పరువు నిలబెట్టి బ్రతకడానికి ఆశ్రయం కల్పించేరు. కన్న తల్లీ తండ్రీకూడా వినిసహించలేని నేరాన్ని పల్లెత్తు మాటనకుండా ఇంత విశాల హృదయంతో చేరదీసిన మీకు మించిన దైవం నాకీ ప్రపంచంలో లేదు. నాకీ ఆశ్రయం దొరికింది. అది చాలు. నేను మీ సౌఖ్యానికి అడ్డు రాను. నే నున్నానని తేవికీ సంకోచించకండి. మీ మనసు కేది సుఖం అనిపిస్తే అది చేయండి. మీ సుఖమే నా కానందం' అతని పాదాలను కన్నీళ్ళతో అభిషేకిస్తూ మొదటి రాత్రి అనసూయ చెప్పిన మాటలు అవి.

'జరిగింది మరచిపో అనసూయా! నువ్వు నా భార్యవు. నా అర్ధాంగివి. నా భార్యగా నీకు అన్ని హక్కులూ ఉన్నాయి. తమ నేరాల్ని కప్పిపుచ్చుకొని పైకి వెక్కిరించేవారి కల్పితానందంకంటె కడిగిన ముత్యం లాంటి మన వాస్తవికానందం ఎన్నోరెట్లు మేలు.' సజల నేత్రాలతో ఉన్న అనసూయలో ఏదో పరిపూర్ణత చూస్తూ అప్రయత్నంగా రామమోహనరావు అన్న మాటలు.

ఎవరికీ అనుమానం కలుగకుండా మద్రాసులో ఒక నర్సింగు హోమ్‌లో మగపిల్లవాణ్ణి ప్రసవించింది అనసూయ.

'ఇటు చూడు! ఇది ఏడవడానికి సమయం కాదనసూయా! నువ్వు చేసిన తప్పేమీ లేదు. నిన్ను నే నొక పరిపూర్ణ వ్యక్తిగా ప్రేమిస్తున్నాను. నేను బ్రతికుండగా వీడికేమీ లోటురాదు. నేనే వీడి తండ్రిని అనసూయా!' అవమానంతో రెండో ప్రక్కకు ముఖం

తివ్పుకున్న అనసూయ కళ్ళు తుడుస్తూ అన్నాడు రామమోహన రావు.

'మీరు నా కిస్తూన్న విలువ నన్ను పిచ్చిదాన్ని చేస్తూంది. కాని మీకు నే నిస్తున్న నా పాప ఫలాన్ని...' అనసూయ గొంతు పూడిపోయింది.

'వద్దు అనసూయా! ఆ మాటలు వద్దు!' ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో పోసిచ్చేడతను.

'మీరుకూడా త్రాగండి!'

అతను కాఫీ త్రాగుతూంటే ఆమె అలాగే చూస్తూ ది.

'ఏమిటలా చూస్తున్నావు?' ప్రశ్నించేడతను.

గట్లు తెగిన సంతృప్తితో సిగ్గు మరచి పోయిందామె.

'చూస్తున్నాను. ఇంత సుందర రూపాన్ని భగవంతుడెలా సృష్టించేడా అని. ఇంత విశాల హృదయాన్ని మీ చిన్న శరీరంలో ఎలా ఇమడ్చేడా అని చూస్తున్నాను. ఈ నీచురాలి జాతకంలో ఇంత నిధిని దేవుడు ఎలా దాచేడా అని చూస్తున్నాను.' చెంపలమీద నుంచి కళ్ళల్లో నిండిన నీరు జారి పోతూంటే అతని చేయి తన చేతుల్లోకి తీసుకొని మృదువుగా చుంబించిందామె.

'ఏమిటీ పిచ్చిపన్లు?' అతని హృదయం ఆర్ద్రమైంది.

'నాకీ రోజు పిచ్చే ఎక్కింది. ఈ పిచ్చి నాలో శాశ్వతంగా ఉండిపోతుంది. ఏమండీ! నేను మిమ్మల్ని




ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు

* ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడాచాలామంచిది

* ఐటెక్స్ బిందీ
కంటికింపైన
రంగులలో
లభించును.

* ఐటెక్స్
కుంకుం పేస్టు.




అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 – మద్రాసు–17.

నా ప్రాణంకంటె ఎక్కువగా ప్రేమిస్తున్నానంటే నమ్ముతారా ?'

'నేను గుర్తించేను అనసూయా !'

'ఏమండీ ! ఒక్కమాట అడుగుతాను చెప్తారా ? మీరు పెళ్ళిముందు ఒకమ్మాయిని చూసొచ్చేరని విన్నాను. ఎంతో అందంగా ఉంటుందట. మీకెప్పుడైనా గుర్తుకు వస్తుందా ?' కొంచెం సేపు ఆగి ప్రశ్నించింది.

'అనసూయా ! ఏమిటీ యక్ష ప్రశ్నలు ? ఇంకోటేదైనా మాట్లాడు !' అతను మాట తప్పించబోయాడు.

'ఇది ఒక్కటీ చెప్పండి !' అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

'భగవంతుడి సృష్టిలో సౌందర్యానికి అంతమే లేదు అనసూయా! అత్యాసతో మనం దాని వెనుక పరుగు పెడుతూంటే ఒకదానికి మించిన దొకటి ఉంటూనే ఉంటుంది. అన్ని సౌందర్యాలూ విశాలమైన ఈ సృష్టిలో ఒకే మనిషికి అనుభవించేందుకు హక్కు లేదు కూడా ! అలా పేరాశతో దాహం తీర్చుకుందా మనుకొని పరిగెత్తే మనిషికి జీవితంలో అసంతృప్తే మిగులుతుంది.'

'నే నింటికి వచ్చేస్తానండీ !' అంది అనసూయ ఉన్నట్లుండి.

'అదేమిటీ ? ఇప్పుడెలా వస్తావు అనసూయా !'

'నేను మిమ్మల్ని విడిచి ఉండలేను. ఒక్క క్షణం కూడా ఉండలేను. ఎప్పుడూ మీ ముఖంలోకి చూస్తూ ఏమిటేమిటో వింటూ అలాగే ఉండాలని పిస్తూంది !' రెప్ప వాల్చకుండా అతని ముఖంలోకి చూస్తూ అంది ఆమె.

'దానికేం భాగ్యం అనసూయా ! నీ శరీర పరిస్థితికి ఇక్కడ ఉండడం అవసరం !' అని అతను నవ్వుతూ పిల్లవాడివైపు చూసేడు. ఆమె ఇంకా అతని ముఖంలోకే చూస్తూంది. నిష్కల్మషమైన, అచంచలమైన అతని సంతృప్తి అసూయా స్వార్థాలకు మించిన అతని చిరునవ్వు ఆమెకు అనంత సముద్రంలా కనిపించేయి.

కాల ప్రవాహంలో నాలుగేళ్ళు దొర్లిపోయాయి. ప్రవాహంలోని రెండు నీటి బుడగలు పగిలిపోయాయి. అనుకోని అంధ్రి అకస్మిక మరణం రామమోహనరావును పూర్తిగా కృంగదీసింది. ఆ వియోగాన్నుంచి కోలుకోకుండానే ఒకరోజు అనసూయ మనసు విప్పి ఆలోచించలేని పరిస్థితిలో, కళ్ళు విప్పి చూడలేని పరిస్థితిలో, నోరు విప్పి మాటాడలేని పరిస్థితిలో ఆమె శరీరంలోని రక్తం స్తంభించి

పోయింది. కుళ్ళిపోయిన ఆమె శరీరం మఱూచి వార్డులోంచి బయటకు తీసుకొని పోతూంటే శవచ్ఛవంలా, అచేతనంగా అనుసరించేడు రామమోహనరావు. ఆ దెబ్బతో అతను ఇంచుమించుగా పిచ్చివాడై పోయాడు. ఏ పాపం చేయని తనను చిత్రహింస చేసేదనే అర్థం లేని కసిలో, దేవుడికి సవాలు చేస్తూన్నట్లుగా అతడు మరో పెళ్ళే తలపెట్టలేదు.

అగమ్యంగా పరిగెడుతూన్న అతని జీవితంలో స్వాతంత్ర్య సమరం ఆప్యాయంగా ఆహ్వానించింది. ఉన్న స్వార్థం ఎప్పుడో చచ్చిపోయింది. ఆ ఆవేశంలో జైలు జీవితం చవిచూశాడు. అతని శరీరం ఖద్దరు దుస్తుల్లోకి మారింది. బిగపట్టిన కోరికలలో, తీరని కోరికల కలల్లో, అయ్యో ఇవి కలలేనా అనే నిట్టూర్పులతో దొర్లిపోయింది




కాలచక్రం మరో ఇరవై సంవత్సరాల మేరకు. యాభై ఏళ్లు నిండకుండానే ముగ్గు బుట్టయి పోయింది రామమోహనరావు ... కాదు ... రావుగారి తల. ఆస్తంతా దేశసేవలో కరిగిపోయింది. బి. ఎ. ఫస్టుక్లాసులో పాసయిన కొడుకు రఘు చదువు అక్కడే నిలచిపోయింది ఆర్థిక దుస్థితిలో. కళ్ళనీళ్లు పెట్టుకున్న రావుగారిని చూసి అవకాశం ఉన్నప్పుడే చదువుకోవచ్చు నాన్నా! నువ్వేం బాధపడకు! నాకు చదవాలని కూడా లేదు' అన్నాడు రఘు. గత నాలుగేళ్లుగా రఘు హైదరాబాదులో ఎ. జీస్. ఆఫీసులో పై తరగతి గుమాస్తాగా ఉంటున్నాడు. ఎల్. ఎల్. బి, పూర్తి చేశాడు రాత్రి కాలేజీలో చదివి. ఎన్నో ఆహ్వానాల తరువాత ఈ రోజు వెడుతున్నారు రావుగారు కొడుకు రఘు దగ్గరకి.

• • •

బెజవాడ స్టేషను వచ్చింది. రావుగారికి కాళ్ళు తిమ్మిరెక్కినట్లుయింది. ఒక్కసారి లేచి నుంచున్నారు. పైన చూస్తే బెర్తంతా ఖాళీగానే ఉంది. తొడతొక్కిడిగా జనం లోపలకు వస్తున్నారు. అయన చూస్తూండగానే బెర్తు మీదికి రెండు పెట్టెలొచ్చేయి. సంచీలోంచి ఒక దుప్పటి తీసి పైన పరచేరు మిగిలిన

చోటులో పైకెక్కి క్రిందికి చూస్తూ పడుకున్నారు.

సీతామహాలక్ష్మి సంచీలోంచి పొట్లాం తీసి విప్పింది. పూరీ లున్నాయి అందులో. 'ఇంద! ఇవి తిను!' అని పూరీలు తుంచి పంచదారతో కొడుక్కి తినిపిస్తూంది. ఆమె ప్రతి కదలికలోనూ ఆయన కేదో అందం కనబడుతూంది. పిల్లవాడు తిన్న తరువాత మిగిలినవి ఆమె తిని మరచెంబులో మంచి నీళ్లు పిల్లవాడికి త్రాగించి తనుత్రాగింది.

'అమ్మా! మనం హైదరాబాదులోనే ఉండి పోదామా!' పిల్లవాడడుగుతున్నాడు.

'ఓ నెలుండి మళ్ళీ వచ్చేద్దాం!' అందామె అతని ముఖంపైపడిన జుట్టు వెనక్కి తోస్తూ.

'తిరిగి వచ్చేటప్పుడు కొత్త కారులోనే వస్తామా!'

'ఏమో! అది వచ్చిందో లేదో! బొంబాయినుంచి రావాలి! వస్తే కారుమీదే వద్దాంలే!'

'మరి నాన్న కారు నడపడం ఎప్పుడు నేర్చుకొన్నాడే!'

'ఈ పైన నేర్చుకుంటారు. నువ్వు కూడా బాగా చదువుకుంటే అన్న య్యలా, పెద్దయేక కారు మీద తిరగొచ్చు.' అతని బుగ్గలు సంతోషంతో సాగేయి. బెజవాడలో బండి కదిలింది. కుదుపుకు మెల్లగా రావుగారి కళ్లు మూతలు పడ్డాయి.

రావుగారి భుజంమీద చేయి పడ్డట్లయింది. 'ఎవరు?' కళ్ళు తెరచి చూసేరు.

'ఉష్! గట్టిగా మాట్లాడకండి! అందరూ పడుకున్నారు. లేస్తారు.' అంది సీతా మహాలక్ష్మి మెల్లగా పక్కలో కూర్చుంటూ.

'సీతా!' రావుగారి కళ్లు అనం దాశ్చర్యాలతో మెరిసేయి.

'ఆశ్చర్యంగా ఉంది కదూ! మీ మనస్సులో ఆలోచనలన్నీ నెమరు వేసుకున్నారు కానీ మిగిలిన వాళ్ళ క్కూడా మనసు లుంటాయనీ, వాళ్లకూ ఆలోచన లుంటాయనీ తోచనే లేదా!' ఆమె నవ్వి ఆయనకు కన్నుల పండువ చేసింది.

'ఆనాటి నుంచి ఈనాటి వరకూ నన్ను గుర్తు పెట్టుకున్నావా సీతా!'

'నరనరాల్లోకి పాకిపోయిన పరిచయం ఏనాటి దైతేనేం! అది కాలంతో మాసిపోతుందా?'

'కాని కాలంతో నీ రూపం తప్ప మిగిలినవన్నీ మాసిపోయాయి సీతా నా జీవితంలో!' రావుగారి కళ్లు అశ్రుపూరితా లయ్యాయి.

'మీరు కంటతడిపెడితే నేను చూడలేను. గడచినవి మరచిపొండి. ఇప్పుడు నేను వచ్చేనుగా!' ఆమె

మీదికి వంగి, రావుగారి కళ్లు ప్రైటు కొంగుతో తుడిచింది.

"ఇక ఎప్పటికీ నన్ను విడువ కుండా ఉంటావా సీతా !"

"ఎన్నటికీ విడువను. మిమ్మల్ని విడిచి నేను బ్రతుకగలనా ! ఎన్నటికీ విడువను. ఎన్నటికీ విడువను." రావుగారి నుదుటి మీది వెంట్రుకలు మృదువుగా వెనక్కు తోసి ఇంకా మీదకు వంగింది. ఆమె పెదవులు ఆయన పెదవులకు తగిలించింది. ఆమె ఉన్నతమైన హృదయం, వేడెక్కిన ఆయన రొమ్ముకు మెత్తగా అనుకుంది.

"సీతా !" పరవశంతో రావుగారు నరాలు తెగిపోయేంత బిగువుగా కౌగలించుకున్నారు.

పడిపోతూన్నట్లయి చేతి కందింది గట్టిగా పట్టుకున్నారు రావుగారు. కళ్ళు తెరచి చూసేరు. బెర్తుకి బిగించిన ఇనుప గొలుసు చేతిలో ఉంది. మళ్ళీ కళ్ళు నులుపుకు చూశారు. ఏది సీత ? ఏవి ఆమె పెదవులు ! గొలుసును చుంబించిన పన్ను బాధగాలాగుతూంది.

"ఈ ఇనుప గొలుసేనా చేతుల్లో ఇమిడింది ? సీత శరీరం కాదా ! అంతా కలేనా సీతా ?" రావుగారి మనస్సు దుఃఖపు టగాధాల్లోకి తూలిపోయింది. ఆయన క్రిందకు చూడబోయారు.

"ఏమిటిదంతా ? ఏమిటీ పాడు ఆలోచనలు ? ఆమె పరపురుషుని భార్య ! ఇదేనా నీ నీతి ?" అంతరాత్మ హెచ్చరించింది రావుగారిని.

మనస్సు బాధగా మూలిగింది. "నేనామెతో మాటాడలేదు. ఆమెను నేను నాతో మాటాడమన లేదు. కళ్ళతో ఆసుందర దృశ్యాన్ని చూసేందుకు కూడా నాకధికారం లేదా ? ఏళ్ళతరబడి ఎండిపోయిన నా బ్రతుకుపై ఆమె దర్శనం వన్నీటి జల్లు. కళ్ళూ, చెవులూ మూసుకొని ఊర్కోచ్చడమే నీతయితే నాకానీతి వద్దు! నేను అవినీతుడినే! నన్ను మాటాడించకు. ఆమె రూపాన్ని నా హృదయంలో ప్రతిష్ఠించుకోనీ ! నా సౌందర్య దేవతను ఆరాధించనీ ! వాస్తవ జీవితంలో పొందలేని ఆనందాన్ని కనీసం ... కనీసం ... ఒక్క ఊహలోనైనా చవి చూడనీ !" దీనాతిదీనంగా ఆక్రోశించింది ఆమె మనస్సు. రావుగారు తెగువగా క్రిందికి చూసేరు మళ్ళీ.

పెట్టెలో అందరూ నిద్ర పోతున్నారు. ఆమెకూడా నిద్రపోతూంది. కిటికీకి తల నానృకొని, పరవశించి మైమరచిన ప్రణయ దేవతలా. పైట క్రిందికి జారిపోయింది. విశాలమైన తెల్లని కనురెప్పలు సుకుమార దళాల్లాగున్నాయి. చిన్న తీరైన ముక్కు. చిన్నిగడ్డం క్రింద తెల్లని మెడ నల్లని రైకలోంచి కాంతి



వంతంగా వెలుగుతూంది. ఇరుకైన రైక[] మధ్య నుంచి తెల్లగా ఆమె హృదయ శిఖర పీఠాలు ఉచ్ఛ్వాసాలకు ఉబుకు తున్నాయి. నల్లని రైక క్రింద మృదువైన పొట్ట... ...

రావుగారి మనస్సు వలవలా కాగుతూంది. ఏళ్ళ తరబడి బిగపెట్టిన కోరికలేవో విజృంభించి కాల్చేస్తున్నాయి.

'ఈ సౌందర్యాన్ని అనుదినం అనుభవిస్తూన్న ఆ అదృష్టవంతుడెవరు? బంగారు పుస్తె మెడలో కట్టి ఇది నాది అని ముద్రవేసుకున్న అతడెవరు? ఇరవై నాలుగేళ్ళ జీవితంలో అతడు పొందిన ఆనందానికి కొలత లున్నాయా?' అప్రయత్నంగా రావుగారి మన

న్సులో ఏదో అసూయ లాంటిది తలెత్తుతూంది.

'తనకూ ఆమెకూ మధ్య దూరమేమిటి? మూడడుగులు. ఒక్కసారి ఆ కనురెప్పలను పెదవులతో స్పృశిస్తే! ఒక్కసారి ఆ పెదవులను పెదవులతో కలిపితే! ఒక్కసారి ఆమె హృదయంలో ముఖాన్ని దాచుకుంటే!' రావుగారు పట్టరాని ఉద్రేకంతో అసహాయంగా తల గోలునుకేసి కొట్టుకున్నారు. 'అబ్బా!' అలసిపోయిన ఆయన మనస్సుపై ఆయనకే అసహ్యం వేసింది. బలవంతాన రెండో వేపు తిరిగేరు. 'లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్! మేక్ ట్రావెల్ ఎ ప్లెజర్!' ముద్రించిన అక్షరాలను చదువుతూ ఆమెమీది దృష్టి మరల్చడానికి ప్రయత్నించేరు. కాని సాధ్యం కాలేదు. బెర్తుదిగి ఆమె కెదురుగా కూర్చున్నారు ఆమెనే చూస్తూ. ఎన్నో గంటలు దొర్లిపోయాయి ఆ మూగ ఆరాధనలో కొన్ని క్షణాల్లా.

వచ్చేది సికిందరాబాదు స్టేషనే అంటున్నారు ఎవరో. ఇంకొంచెం సేపుంటే ఆమె కనబడదా! ఒక్కసారి మాటాడ కూడదూ తనతో! కనీసం తనవైపు చూడనైనా చూడదేం! తాను ఆమెను దేవతకంటే ఎక్కువగా ఆరాధించటం లేదూ! అవును ఆమె ఎందుకు మాటాడాలి? ఎందుకు గుర్తుంచుకోవాలి? ఆమె అపురూప సౌందర్యవతి. అందుకనే తాను గుర్తుపెట్టుకున్నాడు. కాని తనలో ఏముంది. తన జీవితంలో అన్నీ నెత్తురు కార్చే శూలం పోటులాంటి అనుభవాలు. ఆమెకేం! ఆప్యాయంగా చూసుకొనే భర్త! ముచ్చటగా ముగ్గురు సంతానం! అందులో పెద్ద కొడుక్కు అప్పుడే ఆఫీసరు హెూదా! భర్తకు కొత్తకారు కొనుక్కునే ఆర్థిక స్థితి.


మాటి మాటికి రేగిన పుండులా బాధించే అనుభవాలు తనవి. తీరని ఆశలు ఆరని జ్యోతుల్లా దహించివేస్తూన్న జీవితం తనది. కోరిక పుట్టకుండానే తీరి ఆనందిస్తూన్న అదృష్ట జాతకం ఆమెది. ఆమెకు తానెందుకు గుర్తుండాలి?

సికిందరాబాదు స్టేషన్‌లో బండి ఆగింది. ఆమె పెట్టె, రెండు సంచులు, సర్దుకొని దిగటానికి సిద్ధంగా పెట్టుకొని కూర్చుంది. రావుగారు దుప్పటి మడచి సంచీలో పెట్టుకున్నారు. మళ్ళీ బండి కదిలింది కాని తరువాత పదిహేను నిమిషాలూ మరో నిమిషంలో దొర్లిపోయాయ్. నాంపల్లి స్టేషనులో బండి నిలచిపోయింది.

'ప్రకాశం! నాన్నగారు కనబడకారేమో చూడు!' అంటూ ఖంగారుగా లేచిందామె. గాలికి ఎగిరిన పైటకొంగు రావుగారి ముఖాన్ని కప్పివేసింది. ఆయనకు ఆమెను ఆలింగనం చేసుకున్నట్లనిపించింది. ఆ పైట కొంగు స్పర్శలోనే ఆయన పరవశించిపోయారు. ఆమె కొంగు రెండో ప్రక్కకు తిప్పి దోపుకుంది. ఆమె సిగలోంచి ఒడిలిపోయిన రెండు మల్లెపూవులు రావుగారి ఒడిలో పడ్డాయి ఆయన హృదయం ఆనందంతో పొంగిపోయింది గట్టుగా చేతిలోకి తీసుకొని ఆ ఎండిన పూలలో పారిజాత పరిమళాల్ని అఘ్రాణించేరాయన.

'నాన్నా!' అంటూ రఘు పెట్టెలోకి వచ్చేడు రావుగార్ని చూసి రావుగారి దగ్గరకు రాబోతూంటే ఆమె రఘును ప్రక్కగా చూసి 'కృష్ణా! నాన్న కూడా వచ్చేరా!' అంటూ అతని ముఖం తనవైపు తిప్పుకొని అలాగే తెల్లబోయి చూస్తూ నిల్చుండిపోయింది. రఘూ, రావుగారూ కూడా అర్థం కాక చేష్టలు దక్కి చూస్తున్నారు.

'అమ్మ ఇక్కడ థర్డుక్లాసు పెట్టెలో ఉంది నాన్నా!' అని బయటనుంచి కేకవిని అందరూ అటు చూసేరు. 'అన్నయ్యా!' అంటూ ఆమె కొడుకు ప్రకాశం పరిగెత్తు కెళ్ళాడు కిటికీ దగ్గరకు. ఆమె భర్తను చూడాలనే కుతూ






హాలంతో ముందుకొచ్చేరు రావు గారు.

'మొత్తానికి నీ గుణం పోగొట్టుకున్నావు కాదు! సెకండు క్లాసులో రమ్మంటే ఇందులో వచ్చావేమే!' లోపలకు వచ్చేడు ఆమె భర్త.

ఎవరతను? ఎక్కడో చూసినట్లుంది! అదే నవ్వు! అదే మాట! రావుగారి గుండె చీల్చినట్లయింది. 'మధూ! నువ్వా చివరకు నా సౌందర్య దేవతను చేపట్టింది. దురదృష్టాన్ని నాకిచ్చినట్లే నా అదృష్టాన్ని కూడా తన్నుకు పోయేవా?' మబ్బురంగు పులెన్ సూటులో ఇంకా మధు యువ్వనాన్ని కోల్పోయినట్లు లేదు అతని చేయి ఆసరాగా చేసుకొని ఆమె రైలు దిగింది.

"దిగు నాన్నా!" అన్నాడు రఘు, రావుగారి సంచీ తీసుకుని.

'ఆ పిల్లవాణ్ణి చూసి నువ్వనుకున్నానురా కృష్ణా! సరిగ్గా చూడు నీలా లేడూ?' అంటుందామె కొడుకుతో.

రావుగారికి జరిగిన దృశ్యం చటుక్కున గుర్తుకు వచ్చింది. చూస్తే రఘుకూ, కృష్ణకూ చాలా పోలికలున్నాయి. 'ఆనాడు నేనంటే తోసిపుచ్చేవ్ మధూ! ఈనాడు

కన్నతల్లి స్త్రీకూడా భ్రమపడేంతగా రఘులో ఉన్న నీ పోలికల నేమన గలవ్ మధూ !' అనుకున్నారు రావుగారు. దెబ్బతిన్న పిచ్చుకలా పెట్టె దిగేరు.

మధు కూలీని పిలుస్తూ ప్రక్క నుంచి వెడుతూంటే అతని చేయి తగిలి రావుగారి చేతిలో ఎందు మల్లెలు క్రిందపడిపోయాయ్. వంగి తీసుకోబోయే లోపల అవి బరువుగా అడుగులు వేస్తూన్న మధు ఎంబాసడర్ బూట్లకు అతుక్కుపోయాయి. రావుగారి గుండెపిండినట్లయింది. కళ్ళనిండా నీళ్లు నిండేయి. కన్నీటి తెరల్లోంచి ఏమీ కనబడక కళ్ళజోడు తీసి కళ్లు తుడుచుకుంటూంటే 'ఏమిటి నాన్నా !' అన్నాడు రఘు ఆయన ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ. కంట్లో బొగ్గు పడిందన్నారు రావుగారు. ఆయన చూస్తూండగానే మధుసూదనం కొత్త కారు కదిలిపోయింది మెత్తగా. మలుపు తిరుగుతూన్న కారు వెనుక అద్దంలోంచి తెల్లని సూర్య కిరణాలు రావుగారి కళ్ళల్లో పొడిచేయి నువ్వు వాళ్లను చూడటానికి అర్హుడవు కాదన్నట్లుగా.

'నా జీవిత సౌఖ్యాన్ని ధారపోసి ఒక అబలను కాపాడబోయాను. ఫలితంగా కన్నతండ్రికి దూరమయ్యాను. కనీసం ఆమెనైనా దక్కించుకోలేక పోయాను. కాని ఆ కామాంధుడి పాప ఫలాన్ని నేను పెంచాల్సి వచ్చింది. శరీర సుఖానికి ఒక జీవితాన్నే బలి చేయడానికి వెనుతీయలేదు వాడు! ఐనా, నా సౌందర్య దేవతను స్వంతం చేసుకొని చెప్పలేని సుఖాన్ని పొందుతున్నాడు. ఈ అరని మంటలను నే నెలా భరించను? నేను చేసిన ఏ తప్పుకు నాకీ శిక్ష భగవాన్ !' ఆయన హృదయంలో అణగని తుఫాను లేచింది. రఘుకు ఏమీ అర్థంకాక తండ్రి కళ్ళల్లో నీళ్ళు చూసి బెదిరిపోయాడు. 'అదేమిటి నాన్నా?' అన్నాడు ఆందోళనతో ముందుకొచ్చి. దుఃఖంతో పూడిపోయిన గొంతులోంచి మాట రాక, సానుభూతి లభించక ఆవేదనతో గుటకలు మింగేరు రావుగారు. ఆ ఆదర్శవ్యక్తి ... ఆ దేశభక్తుడు— కాదు—ఆ దైవోపహతుడి కళ్ళనుండి రెండు నులి వేడి కన్నీటి చుక్కలు ఆయన ముతక ఖద్దరు లాల్చీపై పడి ఇంకిపోయాయి, విధి చేతి వ్రాలులో ఇంకిపోయిన ఆయన ఆదర్శాలు లాగే.

□□□